

పీఆర్టీయూటీజీ సభ్యత్వ నమోదు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 29: పట్టణంలోని గిరిజనసంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆదివారం పీఆర్టీయూటీజీ ఉపాధ్యాయులు సీఆర్టీలసభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఆర్టీలు నాలుగు నెలలుగా వేతనాలులేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వారికి వెంటనేవేతనాలు విడుదల చేయాలని, మినిమం టైంస్కేల్ అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీ యూటీజీ నాయకులు శ్యాంసుందర్, మారుతి, సీఆర్టీలు శంకర్, శ్రీనివాస్, విజేష్, చేతన్, ప్రవీణ్, విజయలక్ష్మి, ప్రేందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా రెడీ..

● జిల్లాలో 98శాతం పూర్తయిన సర్వే

● ఎన్నికల ప్రకటన వరకు ఓటర్ల నమోదుకు అవకాశం

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 29: ఈఏడాది ఫిబ్రవరిలో గ్రామ సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో అప్పటినుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం అయింది. రాష్ట్ర ఎన్నికల సంఘం త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధం అవుతుండగా, ఓటరు జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు, వలసవెళ్లిన, చనిపోయిన వారిపేర్లు తొలగించి ముసాయిదా ఓటరు జాబితాను సిద్ధం చేశారు. ఈ జాబితాను ఈనెల 30న విడుదల చేసేందుకు అధికారులు సిద్ధం చేశారు. ఆగస్టు 20 నుంచి జిల్లాలో మొదలైన ఇంటింటి సర్వే అక్టోబరు 18వరకు కొనసాగనుంది. అక్టోబరు 19నుంచి నవంబరు 28వరకు జాబితా పూర్తి, అక్టోబరు 29నుంచి నవంబరు 28వరకు అభ్యంతరాలు, ఓటరు జాబితాలు, ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడతారు. డిసెంబరు 24వరకు వచ్చిన అభ్యంతరాలను పరిష్కరిస్తారు. జనవరి6న పూర్తి స్థాయి తుది జాబితాను విడుదల చేస్తారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రెండు నియోజకవర్గాల్లో సిర్పూర్‌లో 2,29,577మంది ఓటర్లకు గానూ ఇప్పటికే 2,22,795 (97.05%)ఓటర్ల ఇంటింటా సర్వే పూర్తయ్యిందని అధికారులు పేర్కొన్నారు. అలాగే ఆసిఫాబాద్‌లో మొత్తం ఓటర్లు 2,27,540మంది ఉండగా 2,26,746 (99.65%) పూర్తి చేశారు. జనవరి 2025లో తుది జాబితా ప్రచురించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు..

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జాబితా సవరణలో భాగంగా పోలింగ్‌కేంద్రాల వారీగా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా బీఎల్‌వోలు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితాలతో అక్టోబరు 29నుంచి నవంబరు 28వరకు అందుబాటులో ఉండి కొత్తఓటర్లు, మార్పులు, చేర్పులు, తొలగింపు, ఫొటోల మార్పులు వంటి వాటికి దరఖాస్తులు స్వీకరిస్తారు. 2025జనవరి1 నాటికి 18 ఏండ్లు నిండిన వారిని గుర్తించి వారినుంచి కొత్త ఓటు నమోదుకు దరఖాస్తులు తీసుకుంటారు. చిరునామాలో లేని వారిని, చనిపోయిన వారిని ఇప్పటికే నిర్వహించిన సర్వేలో గుర్తించారు. వచ్చే నెలలో తుది జాబితా సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. పట్టణాలు, మున్సిపాలిటీ ఓటర్లను తప్పించి పంచాయతీ ఎన్నికల కోసం జిల్లా వ్యాప్తంగా జాబితా తయారీ ప్రక్రియ కొనసాగిస్తున్నారు.



ఇంటింటి సర్వే చేపడుతున్న సిబ్బంది

జేబులు నింపుకుంటున్నారు..


● ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల అక్రమాలు

● ఈపీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు స్వాహా

● ఓపీఎస్‌లకు చెందిన రూ.31లక్షలు పక్కదారి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు(ఓపీఎస్‌లు) (ఫైల్)



వాంకిడి గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 29: జిల్లాలో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ఆగడాలు రోజురోజుకు శృతి మించిపోతున్నాయి. అంగట్లో ఔట్‌సోర్సింగ్ కొలువులను పెట్టి బేరసారాలకు దిగుతుండగా తాజాగా ఉద్యోగులకు సంబంధించిన ఈపీఎఫ్, ఈఎస్ ఐ డబ్బులు స్వాహా చేశారు. ఒప్పంద ప్రాతిపదికన పనిచేసే ఉద్యోగులకు సకాలంలో వేతనాలి వ్వక పోవడమే కాదు వారికిచ్చే ఈపీఎఫ్, ఈఎస్ ఐ డబ్బులను సైతం పక్కదారి పట్టిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు జేబులు నింపుకుంటున్నారు. జిల్లాలో ఔట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల(ఓపీఎస్)కు సంబంధించిన ఈఎస్ఐ, ఈపీఎఫ్ రూ.31లక్షలను వారి ఖాతాలో జమ చేయకుండా నేరుగా ఔట్‌సోర్సింగ్ నిర్వాహకులు సొంతానికి వాడుకోవడంతో కొద్ది రోజుల క్రితం ఓపీఎస్‌లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● జిల్లాలో 57మంది ఓపీఎస్‌లు..

కుమరం ఆసిఫాబాద్ జిల్లాలో 57మంది ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు(ఓపీఎస్)గా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9,335 జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పోస్టులకు ప్రభుత్వం 2018లో నోటిఫికేషన్ ఇచ్చి పరీక్ష నిర్వహించింది. 2019లో పోస్టులను భర్తీచేసింది. అప్పుడు విధుల్లో చేరిన వారిలో కొందరు పని ఒత్తిడి, ఇతర త్రా కారణాలతో ఉద్యోగాలకు రాజీనామా చేయడం, సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి లభించటంతో ఆ స్థానాల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో ఈ పోస్టులను 2020లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేయగా జిల్లాలో 57మంది ఓపీఎస్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు.

● జిల్లాలో 19 ఏజెన్సీలు..

జిల్లాలో 19 ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలుండగా 800 ఉద్యోగులు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ఇందులో 2,3ఏజెన్సీలకు సంబంధించిన కార్యాలయాలకు మాత్రమే జిల్లాకేంద్రంలో ఉన్నప్పటికీ మిగితా ఏజెన్సీలకు కార్యాలయాలు లేవు. టెండర్ల సమయంలో తాత్కాలికంగా అద్దె గదులను తీసుకొని ఆ చిరునామాలతో టెండర్లను దక్కించుకొని ఆ తర్వాత కార్యాలయాలను ఎత్తివేస్తున్నారు. దీం తో ఉద్యోగులకు సమస్యలు వచ్చినప్పుడు ఏజెన్సీ కార్యాలయాలు లేకపోవటంతో వారి సమస్యలను పరిష్కరించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఏజె న్సీలు అక్రమాలకు పాల్పడుతున్నా సంబంధిత అధికారు లు వారిపై చర్యలు తీసుకోకపోవటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.

● ఈపీఎఫ్, ఈఎస్ఐ డబ్బుల్లో అక్రమాలు..

జిల్లాలో 57మంది పంచాయతీ కార్యదర్శులు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 2020లో విధుల్లో చేరగా, ఏడాదికాలం పాటు వీరికి ఈఎస్ఐ, ఈపీఎఫ్ డబ్బులను వారి వ్యక్తిగత ఖాతాల్లో గత ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ సక్రమంగానే జమ చేసింది. ఆ తర్వాత 2022ఆగస్టు నుంచి వీరందరికి మహాలక్ష్మి, జీపీ ఇన్ఫోటెక్ ఏజెన్సీలు వేతనాలు చెల్లిస్తున్నాయి. పీఎఫ్ కోసం రూ.3458, ఈఎస్ఐ రూ.582 మొత్తం రూ.4040మినహాయించి రూ.10,960వేతనం అందజేస్తున్నారు. 2022-24 ఆగస్టువరకు రెండేళ్లకు సంబంధించిన 57 మంది పంచాయతీ కార్యదర్శుల నుంచి సదరు ఏజెన్సీల నిర్వాహకులు ఈఎస్ఐ కోసం రూ.7.98,912, 2023-24ఆగస్టు వరకు ఏడాదికి సంబంధించిన ఈపీఎఫ్ రూ.23,65, 272, రెండు కలిపి రూ.31,64,184 తీసుకున్నారు. ఈ డబ్బులను 57 మంది పంచాయతీ కార్యదర్శుల వ్యక్తిగత ఖాతాల్లో జమచేయాల్సి ఉండగా, ఇందుకు భిన్నంగా ఏజెన్సీ నిర్వాహకులు ఆడబ్బుల ను ఖాతాల్లో జమ చేయకుం డా సొంతానికి వాడుకున్నారు. ఈ విషయంపై ఓపీఎస్‌లు సంబంధిత అధికారులను కలిసి తమకు జరుగుతున్న అన్యా యంపై వివరించారు. అయినా ఫలితం లేకపోవటంతో శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బెజ్జూరు, సెప్టెంబరు 29: మండలంలోని బారెగూడ గ్రామానికి చెందిన రామగిరి జింగమ్మ ఇటీవల మృతి చెందగా ఆదివారం ఎమ్మెల్సీ దండెవిఠల్ ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన రాదండి సత్తయ్య కిడ్నీసంబంధితవ్యాధితో బాధపడుతుండడంతో ఆయనను పరామర్శించి మెరుగైనవైద్యం కోసం హైదరాబాద్‌కు రావాలని అందుకు ఏర్పాటుచేస్తానని అన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన కొండ్ర బుచ్చమ్మ సంవత్సరిక కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రహరీనిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. ఆయనవెంట జడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, నాయకులు హర్షద్, శ్రీవర్ధన్, ఓంప్రకాష్,పుష్పలత, నహీర్‌అలీ, రాజేష్, పెంటన్న, కృష్ణ, సంతోష్, అనీల్, పెంటన్న, నహీర్ పాల్గొన్నారు.

నిలిచిన విద్యుత్ సరఫరా

దహెగాం, సెప్టెంబరు 29: మండలకేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వాహనం విద్యుత్‌స్తంభంను ఢీకొట్టింది. దీంతో మండలకేంద్రంలోని ప్రజలు విద్యుత్ అంతరాయంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. స్పందించిన విద్యుత్‌అధికారులు వెంటనే మరమ్మతులు పనులుచేపట్టారు. రాత్రి9గంటలవరకు విద్యుత్‌సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు పేర్కొన్నారు.

బాధితురాలికి ప్రభుత్వం కార్పొరేట్ విద్యనందించాలి

● రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి ● బాధితురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 29: అత్యాచారానికి గురైన బాలికకు ప్రభుత్వం కార్పొరేట్ విద్యను అందించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం బాధిత బాలికను, ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ బాలిక అయినందున పూర్తిబాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహించడం వల్ల యువత మద్యానికి బానిసై ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం బెల్టుషాపులను ఎత్తివేయాలన్నారు. ఎక్సైజ్, పోలీసుశాఖలు సమన్వయంతో బెల్టుషాపుల నివారణకు కృషి చేయాలన్నారు. బాధిత బాలికకుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే మాజీఎంపీపీ మల్లికార్జున్ యాదవ్ కూడా బాధితకుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి అన్నివిధాల ప్రభుత్వం న్యాయం చేయాలని, వారికి తాముఅండగా ఉంటామని మనోధైర్యాన్ని ఇచ్చారు. ఆయన వెంట నాయకులు పెంటయ్య, ప్రసాద్, ప్రహ్లాద్, సుబ్బారావు, మురళీ, వినోద్, శ్రీనివాస్, లింగమూర్తి తదితరులున్నారు.

పోలీసులు 'మీ కోసం' ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

కౌటాల, సెప్టెంబర్ 29: పోలీసులు మీ కోసంలో భాగంగా ఆదివారం మండలకేంద్రంలోని మినీ స్టేడియంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ క్రికెట్‌మ్యాచ్‌ను కౌటాల సీఐ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కౌటాల ప్రెస్, పోలీసులు ఈ క్రికెట్ పోటీల్లో తలపడగా పోలీసు టీం విజయం సాధించింది. ఈసందర్భంగా సీఐ మాట్లా డుతూ పోలీసులు మీ కోసంలో భాగంగా గ్రామంలో పలుసేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సైబర్‌నేరాలు, నిషేధిత ఆన్‌లైన్ గేమ్‌లు, జూదం,బెట్టింగ్,గంజాయి,ఇతర మత్తుపదార్థాలు విక్రయిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందిం చాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మున్ముందు మరిన్ని ఫ్రెండ్లీ క్రికెట్‌పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో కౌటాల, బెజ్జూరు ఎస్సైలు మధుకర్, విక్రంతోపాటు కౌటాల జర్నలిస్టులు పాల్గొన్నారు.



ప్రెస్, పోలీసు క్రికెట్ టీం సభ్యులు

హాస్టళ్లను సందర్శించిన ఎన్‌హెచ్‌ఆర్ సభ్యులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 29: కాగజ్‌నగర్ పట్టణంలోని పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లను జిల్లా హ్యూమన్ రైట్స్(ఎన్‌హెచ్‌ఆర్) సభ్యులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలు అడిగితెలుసుకున్నారు. అనంతరం హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు మాట్లాడుతూ పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై నివేదికను రాష్ట్ర శాఖకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ప్రెసిడెంట్ మాచర్ల శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ వెంకటేష్, మహిళావింగ్ అధ్యక్షురాలు సోనూలే కవిత, గుండా స్వరూప, సెక్రెటరీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



వేతనాల పెంపు కోసం పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 29 : వేతనాల పెంపుకోసం కాంట్రాక్ట్ కార్మికులు పోరాడాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ సూచించారు. శ్రీరాంపూర్ ఓసీపీ ఓబీలో పనిచేస్తున్నబ్లాస్టింగ్ కాంట్రాక్ట్‌కార్మికులతో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణిలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టుకార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వేతనాల పెంపుదల పోరుబాటలో భాగంగా సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కార్మికులు భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓబీ, బ్లాస్టింగ్ కాంట్రాక్టు కార్మికులు తిరుపతి, వెంకట్, సతీష్, గోపాల్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్లేడే, పీహెచ్‌డీలపై నియంత్రణ ఎత్తివేయాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 29: ప్లేడే, పీహెచ్‌డీలపై నియంత్రణ ఎత్తివేయాలని హెచ్‌ఎంఎస్ ఏరియాఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి డిమాండ్‌చేశారు. ఆదివారం తమ యూనియన్ కార్యాలయంలో వారు మాట్లాడారు. కంపెనీలో పనిచేసే అత్యవసర సిబ్బందికి నాలుగేళ్లుగా ప్లేడే, పీహెచ్‌డీలు ఇవ్వకుండా నియంత్రిస్తున్నార న్నారు. అన్ని సంఘాలు వ్యతిరేకించినా యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందనలేదని ఆరోపించారు. అత్యవసర సిబ్బందికి ప్లేడే, పీహెచ్‌డీలు యథావిధిగా కొనసాగేవిధంగా చర్యలుతీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలుచేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రేగుంట సందీప్, మేడపెద్దన్న, సదిరం రాజేంద్రప్రసాద్, పొన్నగంటి అశోక్, తదితరులు పాల్గొన్నారు.



తెరిచి ఉన్న బాక్సులు

ఆర్కే5 గనిలో దొంగతనం

● రూ.3 లక్షల విలువైన సెల్‌ఫోన్లు, రూ.10వేల నగదు చోరీ

శ్రీరాంపూర్, సెప్టెంబరు 29: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే5 గనిలో శనివారం రాత్రి దొంగతనంజరిగింది. మూడోషిఫ్ట్‌లో విధులు నిర్వర్తించేందుకు వచ్చిన ఉద్యోగులు తమ సెల్‌ఫోన్లు, నగదును చెక్క పెట్టెలు, ఇనుప బాక్సుల్లో దాచుకొని గనిలోకి దిగారు. వారు పనులు ముగించుకొని వచ్చేసరికి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కోల్‌కట్టర్, టబ్‌రిపేర్ సెక్షన్లకు చెందిన పెట్టెల్లోని సెల్‌ఫోన్లు, నగదు అపహరణకు గురయినట్లు గుర్తించారు. గదిలోని కిటికీ ఊచలు తొలగించి లోపలికి వచ్చిన దొంగలు పెట్టెల తాళాలు పగులగొట్టినట్లు తెలిసింది. తమకు చెందిన మూడు లక్షల విలువైన సెల్‌ఫోన్లు, పదివేలనగదు అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. తమ గదిమ్యాన్‌వేకు సమీపంలోనే ఉంటుందని, ఎవరూ కూడా దొంగతనం విషయాన్ని గుర్తించలేదన్నారు. దొంగతనం జరగడం ఇది నాలుగోసారి అని కార్మికులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, దొంగతనం విషయంలో తమకు ఫిర్యాదు అందలేదని శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ తెలిపారు.

భద్రతా విభాగం వైఫల్యంతోనే..

ఎస్‌అండ్‌పీసీ విభాగంవైఫల్యంతోనే దొంగతనాలు జరుగుతున్నాయని ఏఐటీయూసీ ఉపప్రధానకార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కేబాజీసైదా పేర్కొన్నారు. ఆదివారం ఉదయం వారు ఆర్కే5 గనిపై మాట్లాడుతూ, ఎస్‌అండ్‌పీసీ విభాగం ఉన్నతాధికారులు చాలాఏళ్లుగా ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. దొంగతనం కేసులు పెట్టడం తరువాత సయోధ్య కుదుర్చుకోవడంతో మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గతంలోనూ మూడుసార్లు ఇదేగనిలో దొంగతనాలు జరిగాయని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని, సరిపడా సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని, కప్‌బోర్డు నిర్మించాలని తాము పలుమార్లు విన్నవించినా యాజమాన్యం పట్టించుకోలేదని దుయ్యబట్టారు. మళ్లీఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పిట్‌కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు పాల్గొన్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యం..

కార్మికులకు వసతులు కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని టీబీజీకేఎస్ ప్రధానకార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆరోపించారు. ఆర్కే5గనిలో శనివారం రాత్రి మూడోషిఫ్ట్‌లో ఉద్యోగులు గనిలోకి దిగిన తరువాత వారు తమ వస్తువులు దాచుకున్న పెట్టెలను దొంగలు పగులగొట్టి మూడులక్షల రూపాయల విలువైన సెల్‌ఫోన్లు, సుమారు 10వేల నగదు దొంగిలించారన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఉద్యోగులకు వ్యక్తిగతంగా కప్‌బోర్డులు, లాకర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

సింగరేణి కార్మికులకు దసరా విందు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 29: కార్మికులకు దసరా విందును యాజమాన్యం ఏర్పాటు చేయాలని రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో దసరా అతిపెద్ద పండుగ అన్నారు. గనుల వద్ద మైసమ్మతల్లి, దేవి విగ్రహాలకు పూజలు చేసి మేకలను,కోళ్లను బలిచ్చి విందులు చేసుకోవడం సిగరేణిలో ఆనవాయితీ అన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని దసరా నాడు కార్మికులను విందు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామని తెలిపారు. సమావేశంలో కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియాఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

విశ్వహిందూ పరిషత్ నిరసన

చెన్నూరు, సెప్టెంబరు 29: తిరుపతి లడ్డు కల్తీ, ఆలయాలపై జరుగుతున్న అక్రమాలకు నిరసనగా ఆదివారం చెన్నూరులోని ప్రతాప మారుతి మందిర్ వద్ద విశ్వహిందూ పరిషత్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ తిరుమలలో గోశాల నిర్వహించి కల్తీ లేని పాలు, పెరుగు, నెయ్యి వాడి లడ్డులు తయారు చేయాలన్నారు. అన్య మతస్తులను ఆలయం నుంచి తొలగించాలని, వారికి ఆలయ ప్రాంగణం లో షాపులు కేటాయించవద్దన్నారు. లక్ష్మణ్‌రావు, శ్రీనివాస్, అక్షిత పాల్గొన్నారు.

భక్తి గీతాలు పుస్తకాల ఆవిష్కరణ

గర్మిళ్ల, సెప్టెంబరు 29: మంచిర్యాల పట్టణంలో ఆదివారం రచయిత డాక్టర్ దాసరి శ్రీనాథ్‌గౌడ్ రచిం చిన పరమేశ్వర, శ్రీలక్ష్మీ పార్వతి సరస్వతి, శ్రీఆం జనేయ సూర్యనారాయణ భక్తి గీతాల పుస్తకాలను మంచిర్యాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముకేష్ గౌడ్ ఆవిష్కరించారు. శతవధాని ఎంవీ పట్వర్ధన్, గొల్లపల్లి శ్యామల, దాసరి పద్మ, కేవీ ప్రతాప్, లచ్చన్న, తోకల రాజేశం, విశ్వేశ్వర్ శర్మ, మలయశ్రీ, అల్లాడి శ్రీనివాస్, దాసరి అంజిబాబు పాల్గొన్నారు.

వైద్యం వికటించి గృహిణి మృతి


శ్రీలత (ఫైల్)

నస్పూర్, సెప్టెంబరు 29 : పీఎంపీ వైద్యం వికటించి ఓ మహిళ ప్రాణం కోల్పోయిన సంఘటన నస్పూర్ పట్టణం నాగార్జున కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. నాగార్జున కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు చింతం రాజు భార్య చింతం శ్రీలత(24) మూడు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోంది. గోదావరి కాలనీలో పీఎంపీగా పని చేస్తున్న బిరుదుల ప్రశాంత్‌కు చూపించారు. శనివారం ఉదయం ఇంటి వద్దనే శ్రీలతకు పీఎంపీ వైద్యుడు ప్రశాంత్ సెలెన్ పెట్టాడు. కొద్ది సేప టికి చలితీవ్రత పెరగడంతో గ్లూకోజ్ తీసివేసి ఇంజక్షన్ ఇచ్చి వెళ్లిపో యాడు. ఇంతలో కూతురు పుట్టిన రోజు కావడంతో స్కూల్ నుంచి కూతురు అన్వితను తీసుకురావడానికి రాజు వెళ్ళాడు. ఇంటికి తిరిగి వచ్చి చూసే సరికి శ్రీలత అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. వెంటనే మం చిర్యాలలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, వైద్యుల సూచన మేరకు హైదరా బాద్‌కు తరలించారు. అక్కడి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం శ్రీలత మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. బ్రెయిన్ డెడ్ కావడం వల్లనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతురాలి భర్త రాజు స్థానిక ఆర్కే-7 గనిలో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం సీసీసీ నస్పూర్ ఎస్సై సుగుణాకర్ ప్రైవేట్ ఆసుపత్రి, మృతురాలి ఇంటిని పరిశీలించారు. ముందు జాగ్రత్తగా పీఎంపీ వైద్యుడు బిరుదుల ప్రశాం త్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సుగుణాకర్ తెలిపారు.

బెల్టుషాపులను నిషేధించాలి

జైపూర్, సెప్టెంబరు 29 : బెల్టు షాపులను నిషేధించాలని పెగడపల్లి గ్రామంలో యువకులు నిరసన చేపట్టారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో బెల్టుషాపుల బంద్‌కు సహకరించాలని తీర్మానం చేశారు. ఎస్టీపీపీ కార్మికుడు మాసు బాలకృష్ణ ఇటీవల మద్యం మత్తులో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసకున్నాడని, దీనికి నిరసనగా బెల్టుషాపులను నిర్వహించవద్దని తీర్మానం చేశారు. పోలీసులు బెల్టు షాపుల నియంత్రణకు కృషి చేయాలన్నారు. యువకులు పాల్గొన్నారు.

వన్ టౌన్ సీఐని సన్మానించిన నాయకులు

బెల్లంపల్లి, సెప్టెంబరు 29: ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా నడుచు కున్నందుకు రాష్ట్రస్థాయిలో వన్‌టౌన్ సీఐ దేవయ్యకు మూడవ ర్యాంకు రావడంతో ఆదివారం కాంగ్రెస్ నాయకులు సీఐని సన్మానించారు. బెల్లంపల్లి పేరును రాష్ట్రస్థాయిలో తీసుకువచ్చినందుకు శుభాకాంక్షలు తెలిపి ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేగుంట రాజలింగు, నాయకులు శివ, శంకర్, భాస్కర్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం


అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ

కాసిపేట, సెప్టెంబరు 29: మండలంలోని తుదుంగూడకు చెందిన కళావతి ఆదివారం సాయంత్రం 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. కళావతికి పురుటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108లో కాసిపేట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా కొండాపూర్ యాప వద్దకు రాగానే నొప్పులు అధికమ య్యాయి. ఈఎంటీ ఆత్మారాం పురుడు పోయగా కళావతి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో కాసిపేట ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

కాలువలు ఇలా... నీరు పారేదెలా...


వందుర్‌గూడ శివారులోని డిస్ట్రిబ్యూటరీ కాలువలో పేరుకపోయిన పిచ్చిమొక్కలు

దండేపల్లి, సెప్టెంబరు 29: కడెం ప్రాజెక్టు సాగు నీరు ఆయకట్టు చివరి పంటలకు అందక రైతులు ఇబ్బంది పడతున్నారు. డిస్ట్రిబ్యూటరీ కాలువలు, ఉప కాలువల్లో చెత్తాచెదారం అడ్డుపడి సాగునీరు ముందుకు పారడంలేదు. సకాలంలో పంటలకు సాగునీరు అందక యేటా రైతులు నష్టపోతున్నారు. తానిమడుగు శివారులోని కడెం ప్రధాన కాలువ మీదుగా 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా తానిమ డుగు, చింతపల్లి, నెల్కివెంకటాపూర్, వందూర్‌గూడ, రెబ్బనపల్లి, వెల్గనూర్, తదితర గ్రామాల పంటలకు సాగునీరు అందించాల్సి ఉంది.

ఆయకట్టు చివరి వరకు నీరు అందకపోయినా నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తవుతున్నాయి. కాలువలో పిచ్చి మొక్కలతో నిండి గడ్డి ఏపుగా పెరిగి సాగునీరు పారడం లేదు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా యేటా ఆయకట్టు చివరి పంటలకు నీరందక పం టలు ఎండిపోయి నష్టపోతున్నామని రైతులు ఆవే దన వ్యక్తం చేశారు. కాలువలో పూడికతీత, పిచ్చి మొక్కలు, చెత్తచెదారం తొలగింపు చర్యలు చేప ట్టాల్సి ఉండగా నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో కాలువ ఆనవాలు లేకుండా పోయింది. అధికారులు దృష్టి సారించి కాలువల్లో పూడికతీత, చెత్తచెదా రం, పిచ్చి మొక్కల తొలగింపు చర్యలు చేపట్టి ఆయకట్టు చివరి పంటలకు సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పరిశోధన పత్రాలు అందజేత


శ్యాంప్రణీత్‌శర్మను సన్మానిస్తున్న నిర్వాహకులు

తాండూర్, సెప్టెంబరు 29: మండలంలోని అచ్చలా పూర్ గ్రామానికి చెందిన వేద పండితులు అప్పాల శ్యాం ప్రణీత్ శర్మ ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం పట్టణంలో జరుగుతున్న ప్రపంచ వ్యాప్త వాల్మీకి రామాయణ మహా సదస్సులో పాల్గొన్నారు. రామాయణంలో అనేక సందర్భా ల్లో వచ్చే యజ్ఞ యాగాది క్రతవులు, వాటిని చేయాల్సిన విధానాలపై పరిశోధన పత్రాలను సమర్పించారు. 40 మంది పండితులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పరి శోధన పత్రాలను సమర్పించినట్లు ఆయన తెలిపారు. సభ నిర్వాహకులు శ్యాం ప్రణీత్‌శర్మను సన్మానించారు.

దీపావళి బోనస్ రూ.93,750

శ్రీరాంపూర్, సెప్టెంబరు 29: బొగ్గు గని కార్మి కులకు యేటా అందించే పెర్‌ఫార్‌మెన్స్ లింక్‌డ్ (పీ ఎల్ఆర్) ఖరారైంది. కార్మికులు దీపావళి బోనస్‌గా పిలుచుకునే రివార్డును రూ.93 వేల 750గా నిర్ణ యించారు. ఆదివారం న్యూ ఢిల్లీలోని కోల్ ఇండియా ప్రధాన కార్యాలయంలో బీఎంఎస్, హెచ్ఎంఎస్, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయ కులతో కోల్ ఇండియా యాజమాన్యం సమావేశం నిర్వహించింది. ఇందులో లక్ష రూపాయల పీఎల్ఆర్ బోనస్ ఇవ్వాలని వారు చర్చ ప్రారంభించగా, చివరకు 93 వేల 750లుగా నిర్ణయమైంది. ఈ బోనస్‌ను దేశవ్యాప్తంగా 2.5 కోట్ల మంది బొగ్గు గని కార్మికులు, సింగరేణిలో 42 వేల మంది కార్మికులు పొందనున్నారు. సింగరేణి నుంచి డైరెక్టర్(పా) వెంకటేశ్వర్ రెడ్డి, బీఎంఎస్ నుంచి సుధీర్ గురిడె, మజారుల్ అన్సారి, యాదగిరి సత్తయ్య, హెచ్ఎంఎస్ నుంచి నాథూలాల్ పాండే, శివ్ కుమార్ యాదవ్, రియాజ్ అహ్మద్, ఏఐటీయూసీ నుంచి రామేంద్ర కుమార్, సీఐటీయూ నుంచి డిడి రామానంద, ఆర్.పి. సింగ్ పాల్గొన్నారు.

కోలిండియా పోటీల్లో గోల్డ్‌మెడల్

మందమర్రిటౌన్, సెప్టెంబరు 29: మందమర్రి ఏరి యా వర్కుషాపులో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న బత్తుల వెంకటస్వామి కోలిండియా పోటీల్లో సత్తా చాటాడు. రెండు రోజుల క్రితం ఒడిస్సాలోని వ్యాలీలో జరిగిన బాడీబిల్డింగ్ పోటీల్లో 90 కేజీల విభాగంలో విజయం సాధించి గోల్డ్‌మెడల్ సాధించాడు. ఏరియా అధికారులు ఆయనను ప్రశంసించారు. ఏరియా వర్కు షాపులో సోమవారం సన్మానించనున్నారు. జీఎం దేవేందర్ వెంకటస్వామిని అభినందించారు.


గోల్డ్‌మెడల్ అందుకుంటున్న బత్తుల వెంకటస్వామి

కాంగ్రెస్ పార్టీలో చేరికలు


పార్టీ కండువా కప్పుతున్న సురేఖ

గర్మిళ్ల, సెప్టెంబరు 29: విశ్వబ్రహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంతోష్‌చారితోపాటు పలు వురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నివాసంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. జిల్లా అధ్యక్షులు రమేష్‌చారి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వీరాచారి పాల్గొన్నారు.

సన్మానం

గర్మిళ్ల, సెప్టెంబరు 29 : రాముని చెరువు కట్ట పైన ఆదివారం వాకర్స్ అసోసియేషన్ నాయకులు ఇటీవల తాండూర్, జైపూర్ ఎంఈవోలుగా బాధ్య తలు స్వీకరించిన మల్లేశం, శ్రీనివాస్‌లను, బది లీపై వచ్చిన మంచిర్యాల ఎక్సైజ్ సీఐని గురు వయ్యను సన్మానించారు. గజెల్లి వెంకటయ్య, సత్తన్న, రాంరెడ్డి, రవిసాగర్, లక్ష్మణ్, రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి, సుధీర్, సురేందర్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ


బతుకమ్మచీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 29: లక్షెట్టిపేట పట్టణంలోని మహిళలకు ఆదివారం కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు చెల్లెల్లు రుక్మిణి, సత్యశ్రీలు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ఎండీ ఆరీఫ్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, మార్కెట్ కమి టీ డైరెక్టర్ తోట రమేష్, కౌన్సిలర్‌లు వెంక టేష్, సువర్ణ, ఉమాదేవి, సురేష్‌నాయక్, మండల అధ్యక్షుడు రమేష్, పాల్గొన్నారు.

హాజీపూర్: కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం దొనబండ, పెద్దంపేట, బుద్దిపల్లి, టీకనపల్లి, హాజీపూర్, పడ్తన్‌పల్లి, కర్ణమా మిడి గ్రామాల్లోని మహిళలకు ఎమ్మెల్యే సోదరీమ ణులు రుక్మిణి, సత్యశ్రీ, కాంగ్రెస్ నాయకులు బతు కమ్మచీరలను పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు రవి, నాయకులు డేగ బాపు, శిల్పా శ్రీనివాసరావు, రాజేశ్వర్‌రావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక వినాయక నవరాత్రి ఉత్సవాలు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 29: హిందూ సంప్రదాయాలకు ప్రతీక వినాయక నవరాత్రి ఉత్సవాలని హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు దీపేష్‌రేన్వా, అంజనిపుత్ర ఎస్టేట్ సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఖండేల్వాల్ భవన్‌లో జిల్లాలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాల శోభా యాత్రకు సంబంధించి మండపాల నిర్వాహకులకు బహుమతులు, మెమోంటోలు అందించి శాలువాలతో సన్మానించారు. జిల్లాలో 287 గణేష్ మండలిలు వినాయక శోభాయాత్ర నిర్వహించగా వారందరికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రతి ఒక్కరికి రూ. 2016లను హిందూ ఉత్సవ సమితి తరుపున అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ స్పాన్సర్లుగా వ్యవహరించి రూ.2 లక్షలు అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, అంజనిపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ ఎండీ పిల్లి రవి, మంచిర్యాల సీఐ బన్సీలాల్, మండపాల నిర్వహకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

జన్నారం, సెప్టెంబరు 29: చింతపల్లి గ్రామంలో ఆదివారం ఆదిత్య ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్ష లు నిర్వహించి మందులను అందజేశారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ మగ్గిడి తిరుపతి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య శిబిరం నిర్వహించామన్నారు. అనంతరం వైద్యురాలును యు వకులు సన్మానించారు. డాక్టర్లు హేమలత, ఆసుపత్రి ఇన్‌చార్జీ రాము, అజ్మత్‌ఖాన్, యువకులు నాగరాజు, వేణు, బాపు, సురేష్, వెంకటేష్, పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

గర్మిళ్ల, సెప్టెంబరు 29 :మంచిర్యాల వొకేషనల్, శ్రీసాయి పారా మెడికల్ కళాశాలల ఫ్రెషర్స్ డే వేడుకలను ఆదివారం నిర్వహించారు. విద్యార్థులు ఆటాపాటలు అలరిం చాయి. కళాశాల చైర్మన్, కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీదేవి, డైరెక్టర్‌లు ప్రతిత్యబాయి, సాయికృష్ణ, స్వప్న, రాకేష్, శైలజ, రమ్యశ్రీ, ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.



బాల్‌బ్యాడ్మింటన్‌లో రాష్ట్రానికి మూడో స్థానం


బెస్ట్‌ప్లేయర్‌గా రాణించిన ప్రేందీప్

రెబ్బెన, సెప్టెంబరు 29: హర్యానా రాష్ట్రంలో రోతక్ జిల్లాలో ఈనెల 25నుంచి 29వరకు జరిగిన సబ్ జూని యర్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపి యన్‌షిప్ పోటీల్లో తెలంగాణ జట్టు మూడోస్థానం సాధించినట్లు బాల్ బాడ్మింటన్ జిల్లా ప్రధానకార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. గోలేటి సింగ రేణి పాఠశాలలో 10వ తరగతి చదువు తున్న దామెర ప్రేందీప్ జాతీయస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీల్లో బెస్ట్‌ప్లేయ ర్‌గా నిలిచినట్లు తెలిపారు. ఈ సంద ర్భంగా కరస్పాడెంట్ రెడ్డిమల్ల తిరు పతి, ఆదిలాబాద్ ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు లయన్ నరసింగం, వంగ మహేందర్, మారిన వెంకటేశ్వర్లుతో పాటు తదితరులు ప్రేందీప్‌ను అభినందించారు.

మన్‌కీ బాత్‌ను వీక్షించిన డాక్టర్ శ్రీనివాస్


మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్

కాగజ్‌నగర్, సెప్టెంబరు 29: ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు డా క్టర్‌శ్రీనివాస్ పార్టీ కార్యాలయంలో వీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ పురోభివృద్ధికి పీఎం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి


మాట్లాడుతున్న రెండో ఏఎన్ఎంలు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 29: ఎన్‌హెచ్ఎం స్కీంలో పనిచేస్తున్న తమను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్‌చేయాలని రెండో ఏఎన్ ఎంలు కోరారు. ఆదివారం ఏఐటీ యూసీ ఆధ్వర్యంలో ఆసఫాబాద్ పట్ట ణంలో నిర్వహించిన సమావేశంలో ఆసంఘం నాయకులు మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహి స్తున్న రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్‌చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీ యూసీ నాయకులు దివాకర్, చిరంజీవి, ఎన్ఎంలు సంతోషి, పుణ్యవతి, సునీత, వసంత, గోదావరి, శైలజ,లక్ష్మి,లలిత, స్వరూప,జ్యోతి పాల్గొన్నారు.

రెబ్బెనలో కుక్కల స్వైరవిహారం

- రాత్రి బయటకు వెళ్లాలంటే జంకుతున్న జనం
- సింగరేణి ఉద్యోగులకు మరింత కష్టం
- ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు


గోలేటిలో రాత్రి వేళల్లో తిరుగుతున్న కుక్కలు

రెబ్బెన, సెప్టెంబరు 29: మండలంలో కుక్కల స్వైరవిహారం పెరిగిపోయింది. రాత్రివేళల్లో మండలంలోని వివిధ కూడళ్ల వద్ద కుక్కలు గుంపులు గుంపులుగా ఉండి వాహనాచోదకు లను వెంబడిస్తు న్నాయి. పలువురిని కరిచాయి కూడా. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తు న్నారు. రెబ్బెన మండలంలోని గోలేటి, నంబాల, పులికుంట, కైరిగూడ గ్రామాల్లో ఆదివారం కుక్కలు దాడి చేసి పలువు రిని గాయపరిచాయి. గోలేటిలో జి సతీష్, ఎం భరత్, సరోజ, జిమ్మబాయి, పులికుంటలో భీమయ్య, శ్రీనివాస్, నంబాలో కళావతి, చిన్నక్కతో పాటు సంజయ్ అనే బాలు డిని తీవ్రంగా గాయపరిచాయి. రాత్రిళ్లు పనికివెళ్లే కార్మి కులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. బైక్‌పై వెళ్లా లంటే ఎక్కడ కుక్కలు దాడిచేసి కరుస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వారం రోజుల క్రితం కూడా గోలేటిలో నలుగురు చిన్నారులపై కుక్కలు దాడి చేసి కరి చాయి. చికెన్, మటన్ దుకాణాల వారు పడేసే వ్యర్థాలను తింటూ గ్రామస్థులపై దాడికి పాల్పడుతు న్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతు న్నారు.


కుక్క కాటుతో
బాధపడుతున్న బాలుడు(ఫైల్)

అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి..



-నరేందర్, గోలేటి టౌన్‌షిప్

మండలంలో కుక్కలబెడద తీవ్రంగా ఉంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని వీటిని నివారించాలి. రాత్రివేళల్లో బయటికి వెళ్లాలంటే భయమేస్తోంది. ఏ కూడలి నుంచి కుక్కలు దాడిచేస్తాయోనని భయంతో వెళ్లాల్సి వస్తోంది.

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు పూర్తి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

వాంకిడి, సెప్టెంబరు 29: మండలంలోని సవ్వాతి, దాబా గ్రామాల మధ్య దెబ్బతిన్న మిషన్‌భగీరథ పైపులైన్ మరమ్మతులు పూర్తి చేశామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఇటీవల జిల్లాలో కురిసిన భారీవర్షాలతో వరదనీటి కారణంగా ఈపైపు లైన్ దెబ్బతిని సంబంధిత గ్రామాలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తాయన్నారు. ఆసిఫాబాద్ డివిజన్ పంచాయతీ అధికారి, పంచాయతీరాజ్ ఈఈ, మండల పంచాయతీ అధికారులతో కలిసి సమస్యను పరిశీలించామన్నారు. గ్రామాలకు తాగునీటిసరఫరా పునరుద్ధరించేందుకు యుద్ధప్రాతిపదికన మరమ్మ తులు చేపట్టి పూర్తిచేశామని తెలిపారు.


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత


వాహనంలో ఉన్న పశువులు

పెంచికలపేట, సెప్టెంబరు 29: మండల కేంద్రంమీదుగా అక్రమంగా తరలిస్తున్న పశు వులను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కొము రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు ఆదివారం తెల్లవారు జామున 4గంటలప్రాంతంలో ప్రధానరహదా రిపై నాలుగువాహనాల్లో 36 పశువు(ఆవులు, ఎద్దులు)లను ఎలాంటి పత్రాలు లేకుండా అక్ర మంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలి పారు. అనంతరం పట్టుబడిన వారిని విచారిం చగా బెజ్జూరు మండలంలోని సలుగుపల్లి నుంచి జగిత్యాలజిల్లాలోని రాజారాంపల్లి పశు వులసంతకు తరలిస్తున్నట్లు తెలిపారన్నారు. పట్టుబడ్డ పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్లు ఆయన తెలిపారు. పట్టుబడ్డ 8మంది వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి


జనక్ ప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న రిటైర్డు కార్మికులు

మందమర్రి టౌన్, సెప్టెంబరు 29: రిటైర్డు కార్మికుల సమస్యలను పరిష్క రించాలని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్‌కు రిటైర్డు కార్మికులు ఆదివారం ఐఎన్‌టీయూసీ కార్యా లయంలో వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ 11వ వేజ్‌బోర్డు పింఛన్ అమలు చేయడంతోపాటు ఏరియర్స్ ఇప్పించా లన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డు కార్మికులు వాసాల శంకర్, రాంరవీందర్, గట్టయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

'ఏచూరి' ఆశయాలను కొనసాగిద్దాం


సంస్మరణ సభలో పాల్గొన్న నాయకులు

కాగజ్‌గనర్, సెప్టెంబరు 29: ఎస్ఎఫ్ఐ పూర్వ జాతీయ అధ్యక్షుడు సీతారాం ఏచూరి సంస్మరణ సభ కార్యక్రమాన్ని కాగజ్‌నగర్‌లో ఆదివారం నిర్వ హించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి సమస్యలపై అనేక పోరా టాలు చేసినట్లు తెలిపారు. ఆయన ఆశయాలను సాధించేందుకు అంతా కృషిచేద్దామన్నారు. కార్య క్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాయికృష్ణ, వివిధసంఘాల నాయకులు మేడి చరణ్‌దాస్, శాంతికుమారి, మధూకర్, కేశవ్, శ్యాంసుందర్, ఖమర్, రాజకమలాకర్‌రెడ్డి, ఓదెలు, జయదేవ్, నర్సయ్య పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు



గుంతను పూడ్చి వేస్తున్న
ముత్తంపేట గ్రామస్థులు

కౌటాల, సెప్టెంబరు 29: మండలంలోని ముత్తంపేట గ్రామసమీపంలోని ప్రధానరోడ్డుకు గ్రామస్థులు శ్రమదానంతో మరమ్మతులు చేశారు. కొద్దిరోజుల క్రితం కురిసిన వర్షాలకు రోడ్డుపై గుంత ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతు న్నారు, రాత్రి సమయాల్లో మరింత ఇబ్బందులు కలుగుతుండడంతో గ్రామపెద్ద గుజ్జరమేష్ మరి కొంతమంది గ్రామస్తులతో కలిసి రోడ్డుపై సిమెంట్ కాంక్రిట్ పోయించి గుంతలను పూడ్చివేయించారు.

ముసలమ్మ దేవర వద్ద మొక్కులు

దహెగాం, సెప్టెంబరు 29: మండలంలోని ఖర్జీ గ్రామస్థులు ఆదివారం గ్రామసమీపంలోని ముసలమ్మ దేవర ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్వరాలు రావడం, కీళ్లనొప్పులు తగ్గకపోవడంతో గ్రామస్థులు ప్రత్యేకపూజలు నిర్వహంచారు. గ్రామ సమీపంలోన మామిడిచెట్ల వద్ద వంటలు వండి సహపంక్తి భోజనాలు చేశారు.





- టీఎస్ బీ పాస్ చట్టంలో విస్తృత అధికారాలు
- అయినా టాస్క్‌ఫోర్స్ బృందానికి మద్దతు కరువు
- అప్పటి అధికారుల చర్యలకు పాలకవర్గం బ్రేక్
- నేడు చర్యలకు వెనుకాడుతున్న వైనం

అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట పడేనా..?

మంచిర్యాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల పరిధిలో అనుమతులు లేకుండా చేపట్టే నిర్మాణాలను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం మున్సిపల్ చట్టం 2019లోని టీఎస్-బీ పాస్‌కు కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా లేఅవుట్ పర్మిషన్, భవన నిర్మాణాలకు అనుమతులు, తదితర ప్రక్రియను పటిష్ఠం చేసేందుకు కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందాలను సైతం నియమించింది. నిబంధనలను అతిక్రమించే వారిపట్ల కఠినంగా వ్యవహరించేలా టాస్క్‌ఫోర్స్ బృందాలకు విస్తృత అధికారాలను ప్రభుత్వం కట్టబెట్టింది. అందులో భాగంగా అనుమతులు లేని నివాస గృహాలు, కమర్షియల్ భవనాలతోపాటు లేఅవుట్ లేని వెంచర్లపై ఎలాంటి ముందస్తు నోటీసులు జారీ చేయకుండానే నేరుగా కూల్చే అధికారం టాస్క్‌ఫోర్స్ బృందాలకు ఉంది. ఆ చట్టం ప్రకారం 2021 సెప్టెంబరులో జిల్లా కేంద్రంలోని వంద ఫీట్ల బైపాస్ రోడ్డులో అక్రమంగా నిర్మిస్తున్న రెండు భవనాలను టాస్క్‌ఫోర్స్ బృందం కూల్చివేసింది.

ఇవీ నిబంధనలు....

భవన నిర్మాణాలు చేపట్టే ప్రజలు అనుమతుల కోసం దరఖాస్తు చేసే సమయంలో సమర్పించిన ప్లాన్‌ను అమలుపర్చాలి. పర్మిషన్ కాపీలో పేర్కొన్న విధంగా నిర్మాణం చేపట్టాలి. సెట్ బ్యాక్, రోడ్డు నిబంధనలు పాటించడంతో పాటు అనుమతులు ఉన్న మేరకు పై అంతస్తుల నిర్మాణం చేపట్టాలి. గృహావసరాలకు అనుమతులు పొంది, కమర్షియల్‌గా ఉపయోగించే వారిని సైతం నిబంధనల ఉల్లంఘన జాబితాలో చేర్చుతారు. గృహ, కమర్షియల్ భవన నిర్మాణాలతోపాటు లేఅవుట్ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసే ప్లాట్లు చట్ట విరుద్ధం కాగా, అలాంటి వాటిపై టాస్క్‌ఫోర్స్ బృందాలకు చర్యలు తీసుకొనే అధికారం ఉంది.

నాటి అధికారుల చర్యలకు అడ్డుకట్ట...

టీఎస్-బీ పాస్ చట్టాన్ని అమలు చేసే దిశలో మూడేళ్ల క్రితం అధికారుల చర్యలకు అధికార పార్టీ (బీఆర్ఎస్) కౌన్సిల్ సభ్యులే అడ్డుకట్ట వేయడం చర్చనీయాంశమైంది. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని హమాలివాడలో 2021 జూలైలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఓ బహుళ అంతస్తుల భవనం స్లాబ్‌ను కూల్చేందుకు ప్రయత్నిస్తుండగా అప్పటి అధికార పార్టీకి చెందిన నాయకులు అడ్డుకోవడంతో అధికారులు వెనుదిరిగారు. అదే సంవత్సరం ఆగస్టులో నస్పూర్ మున్సిపాలిటీ పరిధి రెడ్డి కాలనీలో ప్లాన్‌కు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాల గోడలతో పాటు షెడ్లను కూల్చివేశారు. అదే సమయంలో బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోనూ నిబంధనలకు విరుద్ధంగా వెలసిన కట్టడాలను టాస్క్‌ఫోర్స్ బృందాలు కూల్చివేస్తుండగా మెజార్టీ కౌన్సిలర్లు అడ్డుకున్నారు. అధికార పార్టీ నాయకులే అధికారులను అడ్డుకోగా, నేడు ప్రజాప్రతినిధులు ప్రోత్సహిస్తున్నా మున్సిపల్ అధికారులు ముందుకు కదలక పోవడం శోచనీయం. ఇటీవల నస్పూర్ మున్సిపాలిటీలో అసైన్డ్ భూమిలో నిర్మించిన బీఆర్ఎస్ నేత ఢీకొండ అన్నయ్యకు చెందిన ఐదంతస్తుల భవనాన్ని నేలమట్టం చేసిన అధికారులు అయనతో పాటు 65 మందికి నోటీసులు జారీ చేశారు. అయితే భవనాన్ని కూల్చివేసి పది రోజులు కావస్తున్నా ఇతర అక్రమ కట్టడాల జోలికి వెళ్లడం లేదు.

కూల్చివేతలపై భిన్నస్వరాలు....

చట్టం ప్రకారం కూల్చివేతకు గురవుతున్న నిర్మాణాలపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. రెండు మూడు అంతస్తుల వరకు నిర్మాణాలు పూర్తయిన తరువాత వాటిని కూల్చడం వల్ల సంబంధిత యజమానికి పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లుతుందని, అలా కాకుండా నిర్మాణ పనులు ప్రారంభం కాగానే చర్యలు తీసుకుంటే నష్టం తీవ్రత తగ్గుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఎప్పుడో మూడేళ్ల క్రితం నిర్మించిన భవనాలను కూలుస్తున్న అధికారులు ప్రారంభంలోనే చర్యలు తీసుకోవలసిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అలాగే చట్టంపై అవగాహన ఉండి, నిర్లక్ష్యం వహించే వారిని ఎట్టి పరిస్థితుల్లో వదలకూడదనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. అయితే అధికారుల నిర్లిప్తత కారణంగా టీఎస్ బీ పాస్ చట్టం వచ్చిన తరువాత ఈ మూడేళ్ల లోనే విపరీతంగా అక్రమ కట్టడాలు వెలిశాయి. అయినా చర్యలు ముందుకు సాగకపోవడంతో మున్సి పాలిటీల్లో టీఎస్ బీ పాస్ చట్టం అమలుపై నీలి నీడలు అలుముకున్నాయి.

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న చెన్నూరు న్యాయాధికారి రవి

జైపూర్, సెప్టెంబరు 29: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చెన్నూరు కోర్టు జడ్జి రవి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గురుకుల సాంఘిక సంక్షేమ బాలుర కళాశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే నేరాలు చేయడానికి భయపడతారని సూచించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుంటే మంచి స్థాయికి చేరుకుంటారని తెలిపారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా సత్ప్రవర్తనను కలిగి ఉండాలన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకుని ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. సీనియర్ న్యాయవాది కమల్ మనోహర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, న్యాయవాది శ్రీనివాస్, ఎస్ఐ శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలం



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి

తాండూర్, సెప్టెంబరు 29: స్థానిక సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల ప్రజలు అనారోగ్యం, జ్వరాలతో బాధపడుతున్నా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారన్నారు. ఐబీ సెంటర్‌లోని కూరగాయల సంత వద్ద మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సభ్యత్వ నమోదుపై నాయకులు, కార్యకర్తలకు సూచనలు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, సభ్యత్వ నమోదు కోకన్వీనర్ చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, నాయకులు సుదీర్‌గౌడ్,చిరంజీవి, శేషగిరి, మహీధర్‌గౌడ్, ప్రదీప్, విగ్నేష్, శ్రీనివాస్, చరణ్, చంద్రయ్య,చందు,మహేష్, సతీష్, శ్రావణ్, శంకర్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 29: మంచిర్యాలలోని వేముల బస్తీ, గోపాల్‌వాడలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఇంటింటికి వెళ్లి ప్రధాని మోదీ చేసిన అభివృద్ధిని వివరిస్తూ సభ్యత్వం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని తెలిపారు. దేశాన్ని ప్రధాని మోదీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రావు, కృష్ణమూర్తి, సూరి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఆర్ఎంపీలు

భీమిని, సెప్టెంబరు 29: వీగాం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు గాండ్ల పోచన్నను ఆదివారం నియోజకవర్గ ఆర్ఎంపీలు పోచన్న కుటుంబానికి సానుభూతి తెలిపారు. అనంతరం రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆర్ఎంపీ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జిల్లా అనుభవ వైద్యుల సంఘం ప్రధానకార్యదర్శి బత్తుల రవి, బెల్లంపల్లి అధ్యక్షుడు సూరం రాజేశ్వర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొయ్యడ సత్యనారాయణ, బక్కోళ్ల వెంకటేష్, కన్నెపల్లి మండల అధ్యక్షుడు మైదం రవీందర్, నెన్నెల మండల అధ్యక్షుడు ముదం రమేష్, కాసం పురుషోత్తం, పూసాల కిరణ్, దుగుట చంద్రయ్య, రాజేశం, రాజబాబు, గాండ్ల నరేష్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలి



నిరసన తెలుపుతున్న మండల మాల మహానాడు సంఘం నాయకులు

దండేపల్లి, సెప్టెంబరు 29: ఎస్సీ వర్గీకరణను నిలిపి వేయాలని దండేపల్లిలో ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద మండల మాల మహానాడు సంఘం నాయకులు నిరసన చేపట్టారు. ముందుగా సంఘం నాయకులతో సమావేశం నిర్వహించి ఎస్సీ వర్గీకరణపై చర్చించారు. సంఘం మండల అధ్యక్షుడు మ్యాడ దయాకర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అనే అంశం కులాల మధ్య చిచ్చు పెడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చట్ట విరుద్ధమన్నారు. వెంటనే సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మ్యాడ దయాకర్, సంతపూరి రాజన్న, శ్రీనివాస్, రాకేష్, జీవన్, వసంత్, మోహందర్, నరేష్, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడానికే గ్రామాల్లో పర్యటన



ప్రజలను సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

జైపూర్, సెప్టెంబరు 29: సమస్యలను పరిష్కరించడానికే గ్రామాల్లో పర్యటిస్తున్నానని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం ఇందారంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ కోతలు ఎక్కువగా ఉంటున్నాయని సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు తెలిపారు. ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి కోతలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఎల్లమ్మ గుడి నిర్మాణానికి కృషి చేస్తానని, రోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు చేశానని తెలిపారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ఇందారంలో మంచినీటి ఎద్దడి నివారణకు విశాఖ ట్రస్టు ద్వారా 20 బోర్‌వెల్‌లు వేశానని తెలిపారు. గ్రామాభివృద్ధికి త్వరలో మరిన్ని నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఎస్సీ కాలనీ ప్రజలకు తాగునీటి ఎద్దడి నివారణకు ఒక బోర్‌వెల్ మంజూరు చేశానన్నారు. నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, ఫయాజ్, జక్కుల వెంకటేశం, గడ్డం ప్రసాద్‌గౌడ్, అరికె సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రరావు సంతాప సభ

మందమర్రిటౌన్, సెప్టెంబరు 29: దివంగత కోనేరు వీరభద్రరావు ప్రజాహితమే లక్ష్యంగా పనిచేశారని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం ఎల్లందు క్లబ్‌లో వీరభద్ర రావు సంతాప సభలో మాట్లాడారు. మందమర్రిలో కాంట్రాక్టర్‌గా ప్రస్థానాన్ని ప్రారంభించి అంచెలంచలుగా ఎదిగారన్నారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ప్రసాద్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు బోడ జనార్దన్, సొత్కు సంజీవరావు, బండి సదానందంయాదవ్, రమేష్, రహమాన్, జీఎంలు, సింగరేణి మాజీ డైరెక్టర్‌లు పాల్గొన్నారు. కార్మిక సంఘాల నేతలు వీరభద్రరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాష్ట్ర కనీస వేతనాల మండలి ఛైర్మన్ జనక్‌ప్రసాద్, సమ్మయ్య, దేవి భూమయ్య, నరేందర్, రంజిత్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



వీరభద్రరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పీడీఎస్‌యూ వారోత్సవాల పోస్టర్ల విడుదల

హాజీపూర్, సెప్టెంబరు 29: పీడీఎస్‌యూ 50 సంవత్సరాల వారోత్సవాల పోస్టర్లను ఆదివారం ర్యాలీగడ్‌పూర్‌లోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అక్టోబర్ 24న హైద్రాబాద్‌లోని ఉస్మానియ యూనివర్శిటీలో జరిగే బహిరంగ సభను నాయకులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాజేష్, చైతన్య, ప్రశాంత్,శివకుమార్ పాల్గొన్నారు.

పీజీ సీట్ల కోసం వెబ్ ఆప్షన్‌లు

బెల్లంపల్లిరూరల్, సెప్టెంబరు 29: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభమయ్యే కాకతీయూ యూనివర్శిటీ పీజీ రెగ్యులర్ కోర్సుల కోసం అక్టోబర్ 1 నుంచి 4 వరకు వెబ్ ఆప్షన్‌లు పెట్టుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, పీజీ కోఆర్డినేటర్ మేడ తిరుపతిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ పొలిటికల్ సైన్స్‌తో పాటు ఎంఏ ఇంగ్లీష్, ఎంకామ్ కోర్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 2024-25 సంవత్సరానికిగాను సీపీగెట్ పీజీ ఎంట్రెన్స్ పరీక్ష రాసిన విద్యార్థులు గమనించాలని సూచించారు. మొదటి విడతలో ఇతర కళాశాలల్లో చేరిన విద్యార్థులు సైతం రెండవ విడతలో బెల్లంపల్లి కళాశాలలో చేరడానికి వెబ్ ఆప్షన్‌లు పెట్టుకోవచ్చని తెలిపారు.

సారంగపల్లిలో పోలీసుల పల్లె నిద్ర

మందమర్రిరూరల్, సెప్టెంబరు 29: మండలంలోని సారంగపల్లి గ్రామంలో శనివారం రాత్రి పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లోని యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అందరు కలిసి మెలిసి ఉండాలని, ఎలాంటి గొడవలు పడవద్దన్నారు. సైబర్ మోసాల అప్రమత్తంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గుడంబా, గంజాయి అమ్మినా, సేవించిన కఠిన చర్యలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ



రికార్డులను తనిఖీ చేస్తున్న డీసీపీ భాస్కర్

గర్మిళ్ల, సెప్టెంబరు 29 : మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం మంచిర్యాల డీసీపీ భాస్కర్ తనిఖీ చేశారు. పిటీషన్‌ల రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. మహిళలు, పిల్లలు, సీనియర్ సిటిజన్‌లతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ప్రజలు ఎవరు కూడా గొడవలకు పాల్పడవద్దని, ఒకటి కంటే ఎక్కువ కేసులు నమోదైతే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేసి ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అదే విధంగా ఎవరైనా వ్యభిచారం చేసినట్లు తెలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని సంబంధిత స్థలాలను జప్తు చేసి కోర్టుకు నివేదిస్తామన్నారు. పోలీసులు పాల్గొన్నారు.

పోలీస్ స్పోర్ట్స్ మీట్

హాజీపూర్, సెప్టెంబరు 29: గుడిపేట 13వ బెటాలియన్‌లోని పోలీసు శిక్షణ కేంద్రంలో ఆదివారం శిక్షణ పొందుతున్న కానిస్టేబుల్స్‌కు క్రీడా పోటీలను నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని తెలిపారు. అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ట్రైనీ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కమాండెంట్ వెంకటరాములు